# చైనా ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటన : దాని విశిష్ట లక్షణాలు

లీవీ-హన్

*లీవీ-హన్ చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ యొక్క ఐక్య సంఘటన శాఖకు డైరెక్టరు. ఈయన "హంగ్ కీ" పత్రికలో 1961 సంవత్సరపు 12వ సంచికలో వ్రాసిన వ్యాసం మూడవ భాగం ఇది. దీని మొదటి భాగం డిసెంబరు "సందేశం" లోను, రెండవభాగం జనవరి సంచికలోను ప్రచురించబడింది. ఆ భాగాలలో నాలుగు అంశాలను వివరించారు.*

*ప్రస్తుత మూడవ భాగంలో రచయిత లీవీహన్–ప్రజాతంత్ర విప్లవదశలోను, సోషలిస్టు విప్లవ దశలోను విప్లవ కర్తవ్యాల నిర్వహణకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఐక్యసంఘటన ప్రాధాన్యతను నొక్కిచెప్పారు. జాతీయబూర్జువా వర్గం తానున్న దేశాలలో విప్లవానికి నాయకత్వం వహించగల అర్హతను కోల్పోయిందని, నూతన ప్రజాస్వామిక విప్లవానికి కూడా కార్మికవర్గమే నాయకత్వం వహించాలని చైనా విప్లవ అనుభవాల వెలుగులో విశ్లేషించారు. ప్రజాతంత్ర, సోషలిస్టు విప్లవ దశలలో విప్లవ కర్తవ్యాలను నిర్వర్తించే ఐక్యసంఘటనను అభివృద్ధి చేసుకోవటం గురించి వివరించారు. ఈ అంశాన్ని అవగాహన చేసుకోవటంలో ఆనాడు పార్టీ నిర్మాణంలో వ్యక్తమైన పెడ ధోరణులను, వాటికి వ్యతిరేకంగా సంఘర్షణ జరగవలసిన ఆవశ్యకతను పేర్కొన్నారు. ఐక్య సంఘటనలో రైతాంగ పాత్రను తక్కువ అంచనావేసిన ఫలితంగా జరిగిన నష్టాన్ని, దానిని అధిగమించిన తీరునూ వివరించారు. ప్రజాతంత్ర, సోషలిస్టు విప్లవ దశలను కలగాపులం చేయరాదని హెచ్చరిస్తూనే, ప్రజాతంత్ర విప్లవదశలోనే సోషలిస్టు విప్లవానికి వీలైన అన్ని సన్నాహాలను చేసుకోవాలన్నారు.*

*స్వయంశిక్షణ, స్వీయసంస్కారం సక్రమంగా అమలుజరిగినపుడే ఐక్యసంఘటన పురోగమించి బలపడటంద్వారా రెండు దశలలోనూ విప్లవ కర్తవ్యాలను మరింత సంతృప్తికరంగా నిర్వర్తించగలుగుతుందని స్పష్టంచేశారు. కమ్యూనిస్టుపార్టీ నాయకత్వానికి ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వమనే రాజ్యాంగాధికారమున్నపుడే అభివృద్ధి నిరోధక వర్గాలను శ్రమద్వారా సంస్కరింపబడేట్లు చేయవచ్చునని చైనావిప్లవ అనుభవాలను అన్వయించి వివరించారు.*

*ఒక దేశంలో విప్లవ విజయానికి ఆ దేశంలో విప్లవకృషిమీద ప్రధానంగా ఆధారపడుతూనే, ప్రపంచదేశాలలోని విప్లవశక్తుల తోడ్పాటుయొక్క ఆవశ్యకతను తెలిపారు. ప్రపంచదేశాలపై పెత్తనానికి అర్రులుచాస్తూ, దురాక్రమణ యుద్ధాలు సాగిస్తూ, దూకుడుగా ముందుకువస్తూ, మానవహననాన్ని సృష్టిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా యావత్ప్రపంచంలోని పీడిత జాతులూ, ప్రజలూ, శాంతికాముకులూ, ప్రజాతంత్రవాదులూ ఐక్యసంఘటనగా వ్యవహరించిన అనుభవాలను అందించారు. ఒకదేశ ప్రజల ఐక్యతను, ప్రపంచ ప్రజల ఐక్యతతో మేళవిస్తూ రావాలని, ఇతర దేశాల శ్రామికవర్గ విస్తృత ప్రజానీకంతో చేయీచేయీ కలపాల్సిన ఆవశ్యకతను వివరించారు.*

*విప్లవశ్రేణుల అధ్యయనానికి, అన్వయింపుకు తోడ్పడుతుందనే దృష్టితో ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాం. కామ్రేడ్స్ కంభంపాటి సత్యనారాయణ, కడియాల గోపాలరావు, మహీధర రామ్మోహనరావుగారల సంపాదకత్వంలో 1962 ఫిబ్రవరిలో వెలువడిన నాటి కమ్యూనిస్టు పార్టీ యొక్క మార్క్సిస్టు సిద్ధాంత రాజకీయ మాసపత్రిక 'సందేశం' నుండి పునర్ముద్రిస్తున్నాం.* **– సంపాదకుడు**

**5. ప్రజాతంత్ర విప్లవ దశలోను, సోషలిస్టు విప్లవ దశలోను విప్లవ కర్తవ్యాలను నిర్వర్తించే ఐక్య సంఘటన**

మన దేశంలో ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటన ప్రజాతంత్ర విప్లవ దశ కర్తవ్యాలను జయప్రదంగా నిర్వర్తించి, సోషలిస్టు విప్లవదశ కర్తవ్యాలనూ, సోషలిస్టు నిర్మాణ దశ కర్తవ్యాలనూ జయప్రదంగా నిర్వర్తిస్తూంది. దీన్నిబట్టి, అది రెండు దశల విప్లవ కర్తవ్యాలను నిర్వర్తించే సంస్థ అని తేటతెల్లమవుతుంది. విప్లవాన్ని చివరిదాకా కొనసాగించే ఐక్య సంఘటన అది; విప్లవం అవిచ్ఛిన్నంగా కొనసాగేందుకు ఏర్పడ్డ ఐక్య సంఘటన అది.

ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటన సౌమ్యంగా నూతన ప్రజాతంత్ర విప్లవం యొక్క ఐక్యసంఘటన దశ నుంచి సోషలిజాన్ని నిర్మించే ఐక్య సంఘటనగా అభివృద్ధి చెందగలిగిందంటే, దానికి కారణం చైనా విప్లవంయొక్క చారిత్రక పరిస్థితులు, చైనా

కమ్యూనిస్టు పార్టీ యొక్క సరియైన నాయకత్వమూను, చైనా విప్లవం యొక్క చారిత్రక పరిస్థితులు ఇవి : మొదటి సామ్రాజ్యవాద యుద్ధం, రష్యా అక్టోబరు సోషలిస్టు విప్లవం తర్వాత పెట్టుబడిదారీ విధానం అంతర్జాతీయంగా శిథిలావస్థలో ఉన్నట్లు పూర్తిగా తేటతెల్లమయింది; శ్రామికవర్గ సోషలిస్టు విప్లవ యుగం ప్రారంభం అయింది; వలస, అర్థవలస దేశాలల్లో జాతీయ బూర్జువా విప్లవం శ్రామికవర్గ సోషలిస్టు విప్లవంలో ఒక భాగంగా అయింది. జాతీయ బూర్జువా వర్గం తానున్న దేశంలో విప్లవానికి నాయకత్వం వహించగల అర్హతను కోల్పోయింది; బూర్జువా ప్రజాతంత్ర విప్లవంలో పాత ప్రజాస్వామ్యం స్థానే నూతన ప్రజాస్వామ్యం తలయెత్తింది; ఈ విప్లవం చివరిదాకా సాగాలంటే, కార్మికవర్గం దానికి నాయకత్వం వహించాలి.

కమ్యూనిస్టు పార్టీ సరియైన నాయకత్వం వహించటమంటే, ప్రధానంగా ఇది: పైన చెప్పిన చారిత్రక పరిస్థితుల్లో చైనా విప్లవాన్ని నడపాలంటే ప్రజాతంత్ర విప్లవానికి, సోషలిస్టు విప్లవానికి గల సంబంధాన్ని సరిగా అర్థం చేసుకోవాలి; నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని చివరదాకా సాగించి, ఆ తర్వాత విరామం లేకుండా పెట్టుబడిదారీ విధానం నుంచి సోషలిజానికి పరివర్తన తీసుకువచ్చేందు కవసరమైన సోషలిస్టు విప్లవాన్ని తీసుకు రావలసియుంది; ఇందుకై ప్రజాతంత్ర విప్లవంలో కార్మికవర్గ నాయకత్వం సాధించేందుకు కృషి జరపాలి. ఈ దిగువ సమస్యలు రెండూ అవినాభావ సంబంధంగలవని ప్రతి సందర్భంలో చైనా విప్లవం యొక్క అనుభవం రుజువు చేసింది. ఒకటి, ప్రజాతంత్ర విప్లవానికీ, సోషలిస్టు విప్లవానికి మధ్య సంబంధాన్ని అర్థంచేసుకోవడం; రెండు, ప్రజాతంత్ర విప్లవంలో కార్మికవర్గ నాయకత్వాన్ని సక్రమంగా స్థాపించడం. ఈ రెండు ప్రధాన సమస్యలను సరిగా పరిష్కరిస్తే, ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటన పై రెండు దశలలో విప్లవ కర్తవ్యాలను నిర్వర్తించే ఐక్య సంఘటనగా రూపొందించగలదు.

రష్యాలో అక్టోబరు విప్లవం జయించిన తరువాత లెనిన్, స్టాలిన్‌లు అనేక సందర్భాలలో వలస, అర్థవలస దేశాల్లో విప్లవాలు, పాత బూర్జువా విప్లవాల స్వభావాన్ని కోల్పోయాయనీ, శ్రామికవర్గ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా అవి తయారయ్యాయని సూత్రీకరించారు. ఈ సూత్రాన్ని ఆధారం చేసుకొని చైనా కమ్యూనిస్టు పార్టీ మొదటి విప్లవ అంతర్యుద్ధ దశలోనే, చైనాలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం "ప్రపంచ సోషలిస్టు విప్లవంలో ఒక భాగం అనీ, అది పెట్టుబడిదారీ విధానానికి భిన్నమైన భవిష్యత్తు కొరకు పోరాడా"లనీ సూత్రీకరించింది.

ఈ సూత్రీకరణ సరియైనదే. కాని కామ్రేడ్ మావో సేటుంగ్ చెప్పినట్లు అప్పట్లో యీ సూత్రం పూర్తిగా వివరింపబడలేదు. అందుచేత, యీ సమస్యను అస్పష్టంగా మాత్రమే అర్థం చేసుకోవడం జరిగింది. ఆ రోజుల్లో అవకాశవాదులీ సూత్రాన్ని వ్యతిరేకించారు; లేదా అపభ్రంశ మొనర్చారు. మితవాద అవకాశవాది అయిన చెన్ తూ-సియూ ఈ సూత్రాన్ని వ్యతిరేకించిన వారికి ప్రతినిధి. చైనాలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం పాత ప్రజాతంత్ర విప్లవమని అతని అభిప్రాయం. ప్రజాతంత్ర విప్లవానికీ, సోషలిస్టు విప్లవానికీ మధ్య పెట్టుబడిదారీ దశ (నుండి) ఉండి తీరుతుందనీ, అది బూర్జువా ప్రజాతంత్ర రిపబ్లిక్ రూపం ధరిస్తుందనీ చెన్ తూ-సియూ వాదించాడు. ఈ విధంగా అతడూ, అతని అనుచరులూ ప్రజాతంత్ర విప్లవాన్ని బూర్జువావర్గమే నడపవలసి ఉంటుందని, ఆ విప్లవం జయించడం అంటే బూర్జువావర్గం జయించడమేనని భావించారు; వారి దృష్టిలో కార్మికవర్గం బూర్జువా వర్గానికి కూలీలుగా మాత్రం ఉంటారు. విప్లవం విరామమెరుగకుండా, అవిచ్ఛిన్నంగా కొనసాగాలనే మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని చెన్ తూ-సియూ పూర్తిగా నిరాకరించాడు; ప్రజాతంత్ర విప్లవానికీ, సోషలిస్టు విప్లవానికీ పెద్ద చైనా గోడ నిర్మించాడు; తద్వారా మితవాద దృక్పథంతో శ్రామికవర్గ నాయకత్వాన్ని తిరస్కరించాడు.

రెండోవైపు "అతివాద" అవకాశవాదులున్నారు. వీరు రెండవ అంతర్యుద్ధ దశలో పై సూత్రీకరణను వక్రంగా చిత్రించారు. ప్రజాతంత్ర విప్లవానికి, సోషలిస్టు విప్లవానికీ గల తారతమ్యాన్ని వీరు విస్మరించారు; విప్లవం వివిధ దశల్లో అభివృద్ధి చెందుతున్న మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రాన్ని వీరు నిరాకరించారు. ఆ విధంగా, మొత్తం బూర్జువా వర్గంపై - పెటీ బూర్జువా వర్గంలో పై శ్రేణికి చెందిన వారితో సహా పోరాటం సాగించాలనుకున్నారు; చైనా విప్లవంలో ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా పోరాడే రైతాంగం యొక్క నిర్ణాయక పాత్రను తక్కువ అంచనా వేశారు. ఫలితమేమంటే, వీరు "అతివాద" దృక్పథం నుంచి శ్రామికవర్గ నాయకత్వానికి తీవ్రమైన నష్టం కలిగించారు. ఈ రెండు విధాలైన అవకాశవాదులు ప్రజాతంత్ర విప్లవానికి సోషలిస్టు విప్లవానికీ గల సంబంధాన్ని, వ్యత్యాసాన్ని అర్థం చేసుకోలేదు. ఆ విధంగా వారు శ్రామికవర్గ నాయకత్వమనే సమస్యను పరిష్కరించలేకపోయారు.

వలస, అర్థవలస దేశాల్లో విప్లవాలు పాతరకపు విప్లవాలుగా ఉండే పరిస్థితి ఏనాడో పోయిందనే, లెనిన్, స్టాలిన్‌లు చెప్పిన సూత్రాన్ని ఆధారం చేసుకొని చైనా దేశ చారిత్రక లక్షణాలను దృష్టిలో ఉంచుకొని, కామ్రేడ్ మావో సే-టుంగ్ మొదటి ప్రపంచ యుద్ధం, రష్యా అక్టోబరు విప్లవం తరువాత చైనాలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం బూర్జువా వర్గంచే నడుపబడే పాత ప్రజాతంత్ర విప్లవం ఏమాత్రం కాదనీ, శ్రామికవర్గంచే నడుపబడు నూతన ప్రజాతంత్ర విప్లవమనీ పదేపదే విశదీకరించి చెప్పాడు. పాత బూర్జువా ప్రజాతంత్ర ప్రపంచ విప్లవంలో అదొక భాగంగా లేదనీ, కొత్త శ్రామిక వర్గ సోషలిస్టు విప్లవంలో అది భాగమనీ చెప్పాడు; దాని ఆర్థిక వ్యవస్థను బట్టి చూస్తే ఈ విప్లవం బూర్జువా ప్రజాతంత్ర స్వభావం గలదని ఆయన నిర్వచించాడు; అది ఇంకా సోషలిస్టు విప్లవం కాదనీ; అయితే దాని పురోగతీ, విజయం తప్పనిసరిగా సోషలిస్టు విప్లవానికి దారి తీస్తుందనీ, సోషలిస్టు వ్యవస్థ వైపు పురోగమిస్తుందనీ తెలియజేశాడు. ఈ విధంగా విప్లవం విరామం లేకుండా అవిచ్ఛిన్నంగా సాగుతుందన్న సిద్ధాంతాన్ని, వివిధ దశల్లో విప్లవం కొనసాగుతుందన్న సిద్ధాంతాన్ని ఆయన గతితార్కికంగా సమన్వయపరిచాడు; ప్రజాతంత్ర విప్లవానికీ, సోషలిస్టు విప్లవానికీ గల సంబంధాన్నీ, వ్యత్యాసాన్నీ చక్కగా విశదీకరించాడు; కార్మికవర్గం యొక్క నాయకత్వం కొరకు కృషి చేసి, దాన్ని స్థాపించాలన్న భావాన్ని మౌలికంగా ముందుకు తీసుకొచ్చాడు. కామ్రేడ్ మావో సే-టుంగ్ ఇలా వ్రాసాడు: "చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద కొనసాగే యావత్తు చైనా విప్లవోద్యమంలో రెండు దశలున్నాయి; ఒకటి ప్రజాతంత్ర దశ;

రెండు సోషలిస్టు దశ; ఈ రెండు దశలూ రెండు విభిన్నమైన విప్లవ పరిణామక్రమాలు; ప్రజాతంత్ర దశ పూర్తి అయిన తరువాతనే సోషలిస్టు దశకు చేరుకోవడం సాధ్యం. ప్రజాతంత్ర విప్లవం సోషలిస్టు విప్లవానికి తప్పక అవసరం. రెండోవైపు, సోషలిస్టు విప్లవం ప్రజాతంత్ర విప్లవం యొక్క అనివార్య ధోరణి. కమ్యూనిస్టులందరికీ చరమలక్ష్యం సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం; ఆ తర్వాత కమ్యూనిజాన్ని స్థాపించడం. ప్రజాతంత్ర విప్లవానికి, సోషలిస్టు విప్లవానికి గల సంబంధాన్ని, వ్యత్యాసాన్ని స్పష్టంగా అర్థం చేసుకుంటేనే, మనం చైనా విప్లవాన్ని సరిగా నడపగలం". మావో సే-టుంగ్ : చైనా విప్లవం చైనా కమ్యూనిస్టు పార్టీ ఇంగ్లీష్ అనువాదం. పెకింగ్ - 1960 పుట 50.)

"ప్రస్తుత చైనా విప్లవదశ అర్ధవలస, అర్ధ ఫ్యూడల్ సామాజిక వ్యవస్థను రద్దు చేసి సోషలిస్టు సమాజాన్ని నిర్మించే పరివర్తన దశగా ఉంది. నూతన ప్రజాతంత్ర విప్లవం యొక్క పరిణామ దశ యిది. (పై పుస్తకమే పుట 44)

" ఈ విప్లవంలో మొదటి దశ బూర్జువావర్గ నియంతృత్వం క్రింద పెట్టుబడిదారీ సమాజాన్ని స్థాపించడం కాదు; కాజాలదు. చైనా కార్మికవర్గ నాయకత్వాన దేశంలోని విప్లవ వర్గాలన్నిటి నియంతృత్వం క్రింద నూతన ప్రజాతంత్ర సమాజాన్ని నెలకొల్పటమే ఈ విప్లవంలో మొదటిదశగా ఉంటుంది. ఆ తర్వాత విప్లవం చైనాలో సోషలిస్టు సమాజాన్ని నిర్మించేందుకై రెండవ దశలోకి పరిణితి చెందుతుంది". (మావో సే-టుంగ్ : నూతన ప్రజాస్వామ్యం. ఇంగ్లీషు అనువాదం, పెకింగ్ 1960 పుట 16-17)

1935లో సున్-యీ సమావేశం జరిగిన తరువాత మావో రూపొందించిన ప్రజాతంత్ర విప్లవ సిద్ధాంతానికనుగుణంగా పార్టీ ప్రజాతంత్ర విప్లవానికి మధ్య ఖచ్చితమైన వ్యత్యాసాన్ని గుర్తించి ప్రజాతంత్ర విప్లవదశను స్వీయాత్మక ధోరణిలో విస్మరించడాన్ని ఖండించింది. రెండోవైపు ప్రజాతంత్ర విప్లవానికి సోషలిస్టు విప్లవానికి గల సంబంధాన్ని వివరించింది. ప్రజాతంత్ర విప్లవదశలో సోషలిస్టు విప్లవానికి వీలైన అన్ని సన్నాహాలు చేసింది.

ఈ సందర్భంలో పార్టీ నిర్వహించిన ప్రధాన కార్యకలాపాలివి: **ఒకటి,** పార్టీని నిర్మించి, బలమైన ఖచ్చితమైన అగ్రదళంగా దాన్ని రూపొందించేందుకు, మార్క్సిస్టు - లెనినిస్టు సిద్ధాంతాన్ని అది చక్కగా అన్వయించేట్లు, ప్రజలతో సన్నిహిత సంబంధా లుంచుకొనేట్లు అనవరతంగా కృషి చేసింది. **రెండు** కార్మిక-కర్షక మైత్రిని అది పటిష్ట మొనర్చి అభివృద్ధి చేసింది; తత్ఫలితంగా కార్మికవర్గానికి రైతులు గొప్పమిత్రులయ్యారు; అంతేకాక కార్మిక - కర్షక మైత్రి మీద ఆధారపడి, ఏ శక్తులతో కలియడం సాధ్యమో ఆ శక్తులన్నిటితోనూ పార్టీ చేతులు కలిపి పనిచేసింది.**మూడు,**ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వం క్రింద సాయుధ బలగాలను, విప్లవ స్థావరాలను నిర్మించి, విస్తృతమొనర్చింది; ఆ ప్రాంతాల్లో అనేక నూతన ప్రజాతంత్ర విధానాలను అమలు జరిపింది. ఒకవైపు ప్రభుత్వానికీ, ప్రజల జీవితానికీ ఉపయోగకరమైన పెట్టుబడిదారీ రంగాన్ని కాపాడి ప్రోత్సహించింది; రెండోవైపు సోషలిస్టు రాజకీయ, ఆర్థిక శక్తులను సాధ్యమైనంత హెచ్చుగా పెంపొందించింది. వివిధ నూతన ప్రజాతంత్ర విధానాలను అమలు జరపడంలో పార్టీ క్రమ క్రమంగా రాజకీయ, సైనిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో రాజ్యాంగ యంత్రాన్ని నడపగల అనుభవజ్ఞుల్ని తర్ఫీదు చేసింది. **నాలుగు,** సమగ్రంగా ప్రజాసాన్నిహిత్య పంథాను అమలు జరిపింది; ప్రజలు స్వయంగా విప్లవ పోరాటాలు జరపడంలో, ఆ పోరాటాల నుంచి ఎప్పటికప్పుడు పాఠాలు నేర్చుకొని, తమ రాజకీయ చైతన్యాన్ని వృద్ధిపరచుకోవడంలో నాయకత్వం వహించింది; ప్రోత్సాహం ఇచ్చింది. (ప్రజా సాన్నిహిత్య పంథా మన పార్టీ యొక్క ప్రధాన రాజకీయ, నిర్మాణ పంథా లీ షావ్-చీ : పార్టీ నిర్మాణం), పార్టీ యీ ప్రధాన పంథాను చేపట్టడం వల్లనే, ప్రజల్ని అది పూర్తిగా సమీకరించి, విప్లవాన్ని చివరిదాకా సాగించగల శక్తిని సంపాదించింది. ప్రజాతంత్ర విప్లవదశలో ఎంత విస్తృతంగా, పటిష్టంగా విప్లవశక్తులు, ముఖ్యంగా కార్మిక కర్షకులు సమీకరింపబడితే అంత సమగ్రంగా విప్లవం కొనసాగుతుందని మన అనుభవం నిరూపించింది. అదేవిధంగా ప్రజాతంత్ర విప్లవం ఎంత సమగ్రంగా కొనసాగితే, అంత హెచ్చుగా ప్రజాతంత్ర శక్తులు సోషలిస్టు విప్లవదశలో తమ మధ్య విస్తృతమైన ఐక్యతను పెంపొందించు కోగలుగుతారు; సోషలిస్టు విప్లవం సౌమ్యంగా కొనసాగుతుంది. ఇట్టి పంథా చేపట్టడం వల్ల నూతన ప్రజాతంత్ర విప్లవం సోషలిస్టు శక్తుల అభివృద్ధికి, పెట్టుబడిదారీ శక్తుల అభివృద్ధికీ కూడా దారి తీసింది. సోషలిస్టు శక్తులంటే, "దేశమంతటా శ్రామికవర్గం యొక్క, కమ్యూనిస్టు పార్టీ యొక్క రాజకీయ పలుకుబడిని పెంపొదించడం; రైతుల మేధావుల, పట్టణ, మధ్యతరగతుల ఆమోదం పొందిన లేదా పొందగలిగిన శ్రామికవర్గ నాయకత్వాన్ని, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని గుర్తించడం, ప్రజా రిపబ్లిక్‌లోని ప్రభుత్వ యాజమాన్య సంస్థలూను" మావో సే-టుంగ్ : చైనా విప్లవం చైనా కమ్యూనిస్టు పార్టీ, ఇంగ్లీషు ప్రచురణ పెకింగ్, 1960 పుట 49) ఇట్టి మార్గమవలంబించడం ద్వారా, చైనా విప్లవంలో శ్రామికవర్గం కమ్యూనిస్టు పార్టీ తమ నాయకత్వాన్ని స్థాపించి పటిష్ట మొనర్చగలిగాయి. ప్రజాతంత్ర విప్లవాన్ని జయప్రదంగా పూర్తి చేశాయి. ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వంగా (ఇది ప్రధానంగా శ్రామికవర్గ నియంతృత్వమే) రూపుదాల్చి ప్రజా రిపబ్లిక్కును నెలకొల్పాయి. నూతన ప్రజాతంత్ర విప్లవాన్ని తీసుకొచ్చి, ఆ తర్వాత వెన్వెంటనే విరామం లేకుండా సోషలిస్టు విప్లవాన్ని పురోగమించేందుకు మార్గం సులభం చేశాయి. నూతన ప్రజాతంత్ర విప్లవం విజయం సాధించడానికీ, అది సోషలిస్టు విప్లవంలోకి పరివర్తన చెందడానికీ అవినాభావ సంబంధమున్నదని వాస్తవ పరిణామాలు రుజువు చేశాయి.

మన దేశంలోనే ప్రజల ప్రజాతంత్ర ఐక్య ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్ణమొనర్చే, పూర్తి చేసే ఐక్య సంఘటనగా రూపొందించడానికి కారణ మేమంటే, కమ్యూనిస్టు పార్టీ దానికి నాయకత్వం వహించింది; కార్మిక, కర్షక మైత్రి మీద అది ఆధారపడింది; సాయుధ పోరాటాన్ని అది చేపట్టింది; సాయుధ బలాలు దానికి ప్రధాన బలం. ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్ణమొనర్చే ఐక్య సంఘటన కనుకనే, అది రెండు దశల్లోనూ విప్లవకర్తవ్యాలను నిర్వర్తించే ఐక్య సంఘటనగా, విరామమెరుగని విప్లవాన్ని కొనసాగించే ఐక్య సంఘటనగా రూపొందింది. 1949లో కామ్రేడ్ మావో సే-టుంగ్ ఇలా అన్నాడు: "ఈ ఐక్య సంఘటన ఎంత

పటిష్టమైన దంటే, ఏ శత్రువునైనా ఓడించగల, ఏ కష్టాన్నైనా అధిగమించగల ధృఢసంకల్పం, అనంతశక్తి దానికుంది" (మావో సే-టుంగ్ : నూతన రాజకీయ సంప్రదింపుల సమావేశం యొక్క సన్నాహక సంఘంలో ఇచ్చిన ఉపన్యాసం సెలక్టెడ్ వర్క్స్, 4వ సంపుటి, పుట 407) ప్రజాతంత్ర విప్లవంలోనూ, సోషలిస్టు విప్లవంలోనూ కూడా జరిగింది యిదే. గత పది, పన్నెండు సంవత్సరాల్లోనూ, ఆర్థిక, రాజకీయ, సిద్ధాంత రంగాల్లో కొనసాగిన సోషలిస్టు విప్లవంలో అనేక పరీక్షలకు నిలబడి రాటుదేలింది. ప్రస్తుతం అది వివిధ సామాజిక శక్తులతో అతి విస్తృతంగా కలసి పోరాడుతోంది; సోషలిస్టు విప్లవాన్ని సంపూర్ణంగా కొనసాగిస్తోంది; ఇంకా అధికంగాను, శీఘ్రంగాను ఈ విజయాలు సాధించ దానికి సోషలిస్టు నిర్మాణాన్ని అమలు జరుపుతోంది. అది ఇంకా చాలాకాలం వర్ధిల్లుతుందని ఖచ్చితంగా చెప్పగలం; మనం జయప్రదంగా సోషలిస్టు సమాజాన్ని నిర్మించేవరకు, వర్గాలు శాశ్వతంగా నిర్మూలింపబడే వరకు అది ఉంటుంది. ఈ విషయంలో సందేహమేమీ లేదు.

**6. స్వయంశిక్షణ కొరకు, స్వీయ సంస్కారం కొరకు ఐక్య సంఘటన**

మన దేశ ప్రజలు శత్రువు నెదుర్కోడానికే గాక, స్వయం శిక్షణ కొరకు, స్వీయ సంస్కారం కొరకు, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటనలో కలిసి వున్నారు. స్వయం శిక్షణ, స్వీయ సంస్కారం కొరకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటనలో కలిసి ఉన్నారు. స్వయం శిక్షణ, స్వీయ సంస్కారం సక్రమంగా అమలు జరిగితే, ఐక్య సంఘటన పురోగమిస్తుంది; మరింత బలపడుతుంది; రెండు దశల్లోను తన విప్లవకర కర్తవ్యాలను మరింత సంతృప్తికరంగా నిర్వర్తిస్తుంది.

నూతన ప్రజాతంత్ర విప్లవదశలో మనం ఐక్యత విమర్శన అనే పద్ధతి ద్వారా, ఐక్యత- పోరాటం అనే పద్ధతి ద్వారా కమ్యూనిస్టు పార్టీలోను, విప్లవ సైన్యంలోని, విప్లవ స్థావరాల్లోని ప్రజల్లోను, కార్యకర్తలందరిలోను, మన మిత్రవర్గాల్లోను స్వయం శిక్షణ, స్వీయ సంస్కారం కొనసాగించాలి; ఈ విధంగా రాజకీయ ఐక్యత, పాటవం శక్తిగలిగిన విప్లవకారుల సైన్యాన్ని రూపొందించాం. సోషలిస్టు విప్లవ దశలో కమ్యూనిస్టు పార్టీ, కామ్రేడ్ మావో యీ పద్ధతిని క్రమంగా దేశానికంతకూ జాతీయ బూర్జువా వర్గంతో సహా వర్తింపజేశారు. దాని వల్ల అప్పుడే గొప్ప ఫలితాలు కలిగాయి.

సోషలిస్టు విప్లవం చాలా చాలా విస్తృతమైనదీ, ప్రగాఢమైనదీను. దాని లక్ష్యం సామాజిక వ్యవస్థను మూలమట్టుగా మార్చివేయడమే కాదు; ఉత్పత్తి సాధనాల్లో వ్యక్తుల యాజమాన్యాన్ని రద్దు చేయడమే కాదు; అన్ని విధాలైన దోపిడీని నిర్మూలించడమే కాదు; దోపిడీదార్లందరినీ, సొంత ఆస్తి ఉన్న వారందరినీ అది పూర్తిగా, రాజకీయంగానే గాక, సిద్ధాంత రీత్యాను మార్చివేస్తుంది; యావన్మంది ప్రజలకు అది శిక్షణ గరపుతుంది. కామ్రేడ్ మావో సే-టుంగ్ యిలా వ్రాసాడు: "సోషలిస్టు సమాజాన్ని నిర్మించడంలో, అందరినీ- దోపిడీదార్లను, శ్రామిక ప్రజలను కూడా - సంస్కరించవలసియుంటుంది". (మావో సే-టుంగ్ : ప్రజల మధ్య వైరుధ్యాలను సరిగా పరిష్కరించే మార్గం, ఇంగ్లీషు పెకింగ్ 1960 పుట 39) ఇలా సంస్కరించే కార్యక్రమాన్ని సరిగా అమలు జరిపినపుడే, మనం వర్గాలను నిర్మూలించి ప్రజలందరినీ పూర్తిగా విముక్తి చేసే చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తించగలం. శ్రామికవర్గం తన్ను తాను విముక్తి చేసుకోవాలంటే యావత్తు మానవజాతిని విముక్తి చేయవలసియుంటుందని మార్క్సు, ఏంగెల్సులు తెలియజేశారు. ఇదొక గొప్ప భావం. సోషలిస్టు నిర్మాణాన్ని పెంపొందించే ప్రాతిపదికపై అన్ని రకాలైన మనుష్యుల్నీ సంస్కరించడం ద్వారా బూర్జువావర్గాన్నీ, యితర దోపిడీదారులను ఒకవైపు శ్రామిక ప్రజలంతా స్వీయసంస్కారం విషయంలో యింకొక అడుగు ముందుకు వేసేటట్లు సాయపడ్డం ద్వారానే, మనం వర్గభేదాలను నిర్మూలించి కమ్యూనిస్టు సమాజంలో అడుగుపెట్టగలం. అందుచేత సోషలిస్టు సమాజంలో బూర్జువావర్గం తదితర దోపిడీదారులతో సహా మనుష్యులు అందరినీ సంస్కరించడం ఒక మహోత్కృష్టమైన ఆశయం; కమ్యూనిజం అనే లక్ష్యాన్ని సాధించేందుకు కృషి సల్పవలసిన ఆశయం. దోపిడీ వర్గాలను సమూలంగా మార్చడమంటే అర్థం బూర్జువా శక్తుల్నీ, బూర్జువా మేధావుల్నీ, దోపిడీ దార్లనూ శ్రామిక ప్రజలుగా మార్చడమన్నమాట; శ్రామికవర్గంలో వారొక భాగంగా తయారవడమన్న మాట: ఇది చాలా కష్టమైన పని. దోపిడీదార్ల ఆస్తి యాజమాన్య పద్ధతిని మార్చడం ఇంతకంటే సులభమని మన అనుభవం తెలియజేస్తూంది. నిజంగా కష్టమైన పని దోపిడీదార్లను మార్చడం. ఇదే దానికన్నా పదిరెట్లు ఎక్కువ కష్టం; ఇందుకై దీర్ఘకాలం కృషి చేయవలసియుంటుంది.

ఈ మహత్కార్యాన్ని సాధించాలంటే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం, ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వ మనే రాజ్యాంగాధికారమూ ఎంతో ముఖ్యం. ప్రజల చేతుల్లో రాజ్యాంగాధికారమున్నప్పుడే అభివృద్ధి నిరోధక వర్గాలూ, ప్రజలచే కూలద్రోయబడిన అభివృద్ధి నిరోధకులూ శ్రమద్వారా సంస్కరింప బడేటట్లు చేయవచ్చు. అప్పుడే వారు ఐక్యత- పోరాటం అంటే ఏమిటి? ఐక్యత అనే కోరికతో ఇది ప్రారంభమౌతుంది; విమర్శ ద్వారా, కాక పోరాటం ద్వారా ఏది సవ్యమైనదో, ఏది అపసవ్య మైనదో నిర్ధారణ అవుతుంది: తర్వాత ఒక కొత్త ప్రాతిపదికపై కొత్త ఐక్యత సిద్ధిస్తుంది. కామ్రేడ్ మావో సే-టుంగ్ యిలా రాశాడు : "ప్రజల చేతుల్లో యిలాంటి రాజ్యాంగాధికారం ఉన్నప్పుడే వారు దేశవ్యాపితంగా, ప్రజాతంత్ర పద్ధతుల్లో తమ్ము తాము సంస్కరించుకోగలరు; యావన్మందీ ఈ ఉద్యమంలో పాల్గొనగలరు: అప్పుడే వారు దేశీయ, విదేశీ అభివృద్ధి నిరోధక శక్తుల ప్రభావానికి స్వస్తి చెప్పగలరు. (ప్రస్తుతం యీ ప్రభావం చాలా హెచ్చుగా వుంది. ఇక ముందు కూడా చాలా కాలం ఉంటుంది. దాన్ని త్వరగా నిర్మూలించలేం.) అప్పుడే వారు పాత సమాజం నుంచి సంక్రమించిన అలవాట్లు, అభిప్రాయాల నుండి బయటపడగలరు; అప్పుడే అభివృద్ధి నిరోధకులు చూపే వక్రమార్గాల్లో పడకుండా జాగ్రత్తపడి సోషలిస్టు సమాజం వైపు, కమ్యూనిస్టు సమాజంవైపు పురోగమించగలరు" (మావో సే - టుంగ్ : ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వం, సెలెక్టెడ్ వర్క్స్, ఇంగ్లీషు ప్రచురణ, పెకింగ్, 4వ సంపుటి 418 పుట) ఐక్యత-విమర్శన, ఐక్యత-పోరాటం అనే ప్రజాతంత్ర పద్ధతి ప్రజల వైరుధ్యాలను పరిష్కరించడానికి ఉపయోగ పడుతుంది; ఇదే ఐక్య సంఘటన

పద్ధతి కూడా. ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటన ద్వారా మనం చాలా విస్తృతమైన ప్రాతిపదికపై వివిధ ప్రజాతంత్ర వర్గాలకు చెందిన ప్రజలతో ఐక్యత సాధించేందుకు అనేక మార్గాలనవలంబించాం; అంతేగాక, ప్రజలు అనేక మార్గాల్లో స్వయంశిక్షణ, స్వీయ సంస్కారం పొందేటట్లు సహాయపడగలిగాం. గత పది, పన్నెండు సంవత్సరాల్లోనూ చైనా ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటన, దాని సంస్థ అయిన చైనా ప్రజల రాజకీయ సంప్రదింపుల సంఘం, దాని కమిటీలు బూర్జువా వర్గానికి చెందినవారిని, మేధావులను సంస్కరించడంలో గణనీయమైన పాత్ర వహించాయి.

కామ్రేడ్ మావో సే-టుంగ్ ఇలా వ్రాశాడు : "ప్రపంచాన్ని మార్చడంలో శ్రామికవర్గం, విప్లవ ప్రజానీకం జరిపే పోరాటం ఈ క్రింద కర్తవ్యాలను నిర్వర్తించాలి: భౌతిక ప్రపంచాన్ని మార్చడంతో బాటు స్వీయ ప్రపంచాన్ని కూడా మార్చుకోవాలి. తమ జ్ఞాన సంపాదన శక్తిని మార్చుకోవాలి; భౌతిక ప్రపంచానికీ గల సంబంధాలను కూడా మార్చు కోవాలి. (మావో సే-టుంగ్ : ఆచరణ ఆంగ్ల ప్రచురణ, పెకింగ్ 1960, పుట 23)

నేడు మన దేశంలో అనేక తరగతుల ప్రజలు ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటనలో పాల్గొంటున్నారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం క్రింద వారు చైనాను పూర్తిగా మార్చివేయడానికి, వివిధ దశల్లో విప్లవ కర్తవ్యాలను నిర్వర్తించడానికి విప్లవ పోరాటం జరుపుతున్నారు. అదే సమయంలో వారు యీ విప్లవ పోరాటాల్లో తమకై తాము ఐక్య సంఘటనలో పాల్గొనే వివిధ తరగతుల ప్రజలు, ప్రజాతంత్ర ఐక్య సంఘటనలో పాల్గొనే వివిధ తరగతుల ప్రజలు, చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన సోషలిస్టు విప్లవానికి సంబంధించిన, సోషలిస్టు నిర్మాణానికి సంబంధించిన, కర్తవ్యాలను నిర్విరామంగా నిర్వర్తించడం ద్వారా సర్వతోముఖం గాను, స్వయం శిక్షణ, స్వీయ సంస్కారం అనే విధులను కూడా నిర్విరామంగా సర్వతోముఖంగా నిర్వర్తించడంద్వారాను తేజోవంతమైన, అద్భుతమైన కమ్యూనిస్టు సమాజంలో అడుగు పెట్టగలుగుతారు.

**7. ప్రపంచ ప్రజల ఐక్యతను కాపాడే ఐక్య సంఘటన**

చైనా విప్లవాన్ని నడపడంలో కమ్యూనిస్టు పార్టీ గడించిన అనుభవం మనకు తెలియజేసేది ఏమంటే దేశమంతటా ప్రజల మధ్య అద్భుతమైన ఐక్యత సిద్ధించి యుండకపోతే విప్లవం జయించి యుండేది కాదు. అదే సమయంలో ప్రపంచ విప్లవశక్తుల తోడ్పాటు లేకున్నట్లయితే చైనా విప్లవం జయించడం అసంభవమైయుండేది.

ప్రపంచ విప్లవశక్తుల సహాయం లేకపోతే ఎందువల్ల చైనా విప్లవం జయించి యుండేది కాదు? దీనికి కారణం ఒకటే : సామ్రాజ్యవాదం ఇంకా జీవించియున్న యుగంలో ఉన్నాం. కామ్రేడ్ మావో సే-టుంగ్ చెప్పినట్టు" సామ్రాజ్యవాదమనే రాక్షసి ఆవిర్భవించినప్పటి ప్రపంచ పరిణామాలు ఒకదానితోఒకటి ఎంత సన్నిహితంగా బంధింపబడి వున్నాయంటే ఒక దాన్నుంచి ఒకటి విడదీయ వీలులేదు (మావో సే-టుంగ్ : జపాన్ సామ్రాజ్య వాదంపై పోరాటంలో అనుసరించవలసిన ఎత్తుగడలు, ఇంగ్లీషు ప్రచురణ, పెకింగ్ 1960 పుట) ఆయనింకా యీలా అన్నాడు : "సామ్రాజ్యవాదం జీవించియున్న యుగంలో నిజమైన ప్రజా విప్లవం వివిధ రూపాల్లో ప్రపంచ విప్లవశక్తుల నుంచి తోడ్పాటు పొందకుండా ఏ దేశంలోనూ జయించడం సాధ్యం కాదు; ఒకవేళ జయించినా అది పటిష్టం కాదు. (మావో సే-టుంగ్ : ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వం, సెలెక్టెడ్ వర్క్స్, ఇంగ్లీషు ప్రచురణ పెకింగ్ 1961 4వ సంపుటి పుట 416) అందుచేత మన దేశంలో విప్లవం జయించడానికి, నిర్మాణం కొనసాగడానికి కమ్యూనిస్టు పార్టీ, కామ్రేడ్ మావో సే-టుంగ్ ప్రధానంగా మన కృషి మీదనే ఆధారపడుతూ, విదేశాల నుంచి సహాయం పొందడానికి ప్రయత్నించాలన్న విధానం అనుసరిస్తూ వచ్చారు. మనం ప్రధానంగా మన కృషి మీద ఆధారపడాలి; విప్లవంలో కాని, నిర్మాణంలో కాని మనం కష్టపడి చేసే పనిమీద ఆధారపడాలి. మనమెంత కష్టపడి పనిచేస్తే, ప్రపంచ ప్రజల సానుభూతి, సహకారాలను పొందడానికి అంత అనుకూలమైన పరిస్థితుల్లో మనం ఉంటాం; అంత దృఢమైన సహాయం ప్రపంచ విప్లవశక్తుల నుంచి మనకు లభిస్తుంది. మనం ప్రధానంగా మన కృషి మీద ఆధార పడకుండా వుండడం పూర్తిగా పొరపాటు. కాని వివిధ రూపాల్లో ప్రపంచ విప్లవ శక్తులిచ్చే సహాయానికి గొప్ప ప్రాముఖ్యత ఉందనే విషయం గమనించకపోవడం కూడా పొరపాటే. అట్టి సహాయం పొందడానికి గట్టిగా కృషి చేయకుండా ఏకాకిగా ఉండిపోవడం, లేదా ఎవరి పోరాటాన్ని వారు ఒంటరి పోరాటంగా పరిగణించడం తప్పు. చైనా కమ్యూనిస్టులు, చైనా ప్రజానీకం 40 సంవత్సరాల కఠోర అనుభవంలో, ప్రధానంగా తమ కృషి మీద ఆధారపడటమంటే ఏమిటో చాలా స్పష్టంగానే అర్థం చేసుకొన్నారు; ఇతర దేశాల నుంచి సహాయం పొందడానికి చేయగలదంతా చేయడం అవసరమని కూడా వారు చాలా స్పష్టంగానే అర్థం చేసుకున్నారు. ప్రపంచ విప్లవ శక్తుల సహాయం, ముఖ్యంగా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ ప్రజలు చేసిన సహాయం చైనా విప్లవానికి ఎల్లప్పుడూ గొప్ప ప్రాముఖ్యం వహించిందని మనకు బాగా తెలుసు.

సామ్రాజ్యవాదం జీవించియున్న యుగంలో ప్రపంచ పరిణామాలు ఎంతో సన్నిహితంగా బంధింపబడియున్నాయనీ, వివిధ దేశాల్లోని విప్లవ శక్తులు అన్యోన్యంగా సహాయం చేసుకోవాలని చెప్పడంలో కామ్రేడ్ మావో సే-టుంగ్ ఒక విశ్వజనీన సత్యాన్ని ప్రవచించాడు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత, ముఖ్యంగా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత గడచిన సంవత్సరాల్లో ప్రపంచ పరిస్థితుల్లో వచ్చిన మార్పులు, పరిణామాలు చూస్తే పై సత్యం యొక్క విశ్వజనీనత మరింత సక్రమంగా రుజువవుతుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఒకవైపు అమెరికా నాయకత్వాన సామ్రాజ్యవాద దురాక్రమణ శక్తులు, యుద్ధ శక్తులు అన్ని దేశాల ప్రజలకు మరింత ప్రమాదకరంగా పరిణమించాయి. మరోవైపు శాంతి కోసం యావత్ప్రపంచ ప్రజలు సాగిస్తున్న పోరాటాలు ఏ రోజుకారోజు సన్నిహిత మవుతున్నాయి; సమైక్యమవుతున్నాయి. ఈ పోరాటాలకు సోషలిస్టు శిబిరం కేంద్రంగా వుంది. వివిధ దేశాల్లో నివసించే ప్రజల పరిస్థితులు ఒకే విధంగా లేవు; అంతరంగంగా ఒక్కొక్క దేశంలోని ప్రజలు ఎదుర్కోవలసిన శత్రువులు

కూడా ఒకేలాంటి వారు కాదు; కాని అన్ని దేశాల ప్రజలూ సామ్రాజ్య వాదుల వల్ల ప్రమాదానికి లోనుకావడమో, వారిచే చుట్టుముట్టబడ్డమో జరగుతోంది. ఆయా దేశాల్లోని ఆంతరంగిక శతృవులు తరచు సామ్రాజ్యవాదులకు బంట్లుగా తయారవుతున్నారు. అందుచేత ఆ దేశాల ప్రజలు జాతీయ స్వాతంత్ర్యం కోసం గాని, సోషలిజం కోసం గాని, ప్రజాస్వామ్యం కోసం గాని, శాంతికోసం గాని సాగించే పోరాటాలు తప్పని సరిగా సామ్రాజ్యవాదుల అడ్డంకుల్ని, ముఖ్యంగా యావత్ప్రపంచ ప్రజల ఉమ్మడి శత్రువైన అమెరికా సామ్రాజ్యవాదం యొక్క అడ్డంకుల్ని ఎదుర్కోవలసి యుంటుంది. అందుచేత, వారు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ముఖ్యంగా అతి దుర్మార్గమైన అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడక తప్పదు. సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదం, యావత్ప్రపంచంలోని ప్రజల్ని పరోక్షంగా చైతన్యవంతుల్ని చేసింది; ఒకరికొకరు దగ్గరగా వచ్చేటట్లు, సమైక్యమయేటట్లు చేసింది; క్రమక్రమంగా అమెరికా నాయకత్వం కింద ఉన్న సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్య సంఘటనగా వ్యవహరించేటట్లు చేసింది. ఈ ఐక్య సంఘటన ఎంత విస్తృతమైనదంటే యావత్ప్రపంచం లోని పీడిత జాతుల్నీ, ప్రజల్నీ, శాంతికాముకుల్నీ, ప్రజాతంత్ర వాదుల్నీ అది సమైక్యపరిచింది; వీరు ప్రపంచ జనాభాలో 100కి 90 వంతులున్నారు. ఈ బ్రహ్మాండమైన ఐక్య సంఘటనలో సోషలిస్టు శిబిరం, అన్ని దేశాల కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీలు కేంద్రంగా ఉన్నాయి.

ఒకవైపు సామ్రాజ్యవాదులు, వాళ్ల బంట్లు ప్రపంచ ప్రజల్ని చుట్టుముట్టేందుకు, ఐక్యమైవున్నారు; మరోవైపు సామ్రాజ్యవాదుల్నీ, వారి బంట్లను చుట్టు ముట్టేందుకు ఐక్యమై వున్న ప్రపంచ ప్రజలున్నారు. ఈ విధంగా ఒకరినొకరు చుట్టుముట్టేందుకు జరిగే పోరాటం రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచానికంతకూ వ్యాపించింది. ఈ పోరాటంలో తూర్పు గాలులు, పడమటి గాలులమీద విజయం సాధించాయి. అంటే ఈ రోజున ప్రపంచ ప్రజలదే పైచేయిగా ఉంది. ఈ ఆధిక్యత అంతకంతకు పెరుగుతోంది; ముందుముందు ఇంకా పెరిగి తీరుతుంది.

చైనా ప్రజల ఐక్యసంఘటన ప్రపంచ ప్రజల ఐక్య సంఘటనలో ఒక ముఖ్యమైన అంతర్భాగం. చైనా కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడూ దేశభక్తికీ, అంతర్జాతీయతకూ మధ్య ఐక్యతతో ప్రారంభించి, చైనా ప్రజల ఐక్యతను ప్రపంచ ప్రజల ఐక్యతతో మేళవిస్తూ వచ్చింది. ఒకవైపు దేశంలోపల ప్రజల ప్రజాతంత్ర ఐక్యసంఘటనకు, దానిని పెంపొందిస్తూ, పటిష్టమొనరుస్తూనే, మరోవైపు "మనతో సమాన స్థాయిలో వ్యవహరించే జాతులతో, కొన్ని దేశాల ప్రజలతో సమిష్టిగా పోరాడేందుకై ఐక్యమవడానికి" తాను చేయగలిగినదంతా ఎల్లప్పుడూ చేస్తూనే వచ్చింది. అనగా సోవియట్ యూనియన్‌తోను, నూతన ప్రజాతంత్ర దేశాలతోను, యితర దేశాల శ్రామికవర్గ విస్తృత ప్రజానీకంతోను చేతులు కలిపి, అంతర్జాతీయ ఐక్య సంఘటనను రూపొందించ దానికి శాయశక్తులా కృషి చేస్తూ వచ్చింది. (మావో సే-టుంగ్ : ప్రజల ప్రజాతంత్ర నియంతృత్వం సెలెక్టెడ్ వర్క్సు ఇంగ్లీషు ప్రచురణ పెకింగ్, 1961, 4వ సంపుటి పుట 415.)

1960లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ సమావేశం చేసిన ప్రకటనలలో ఇలా ఉంది : "చైనాలో జరిగిన ప్రజా విప్లవం ఆసియాలో సామ్రాజ్యవాదుల స్థానాన్ని చాలా గట్టిగా దెబ్బతీసింది; ప్రపంచ శక్తుల బలాబలాలు సోషలిజానికి అనుకూలంగా మారేందుకు చాలా సహాయపడింది; జాతీయ విముక్తి ఉద్యమాన్ని మరింత శక్తివంతంగా ప్రోత్సహించడం ద్వారా అది ప్రజలపై ముఖ్యంగా ఆసియా-ఆఫ్రికా-లాటిన్ అమెరికా దేశాల ప్రజలపై, అద్భుతమైన ప్రభావం కలుగజేసింది" (పెకింగ్ రివ్యూ : 1960 సంచికలు 49, 50 పుట 90) ప్రపంచ ప్రజల పట్ల తాను నిర్వర్తించవలసిన విధులు, బాధ్యతలు చైనా కమ్యూనిస్టు పార్టీకి చక్కగా తెలుసు; ఇదివరకు వలెనే ఇక ముందు కూడా అది సోవియట్ యూనియన్ తదితర సోషలిస్టు దేశాలతో, ప్రపంచంలోని పీడిత జాతులు, ప్రజలతో ఒక సంఘీభావాన్ని పటిష్టం చేసుకుంది. అన్ని దేశాల ప్రజలు శాంతి కోసం, జాతీయ స్వాతంత్ర్యం కోసం, ప్రజాస్వామ్యం కోసం, సోషలిజం కోసం జరిపే పోరాటాన్ని దృఢనిశ్చయంతో బలపరుస్తుంది. ఇది వరకు వలెనే ఇక ముందు కూడా చైనా కమ్యూనిస్టు పార్టీ దేశభక్తినీ, అంతర్జాతీయతనూ జోడించి చైనాలోని వివిధ జాతులకు చెందిన ప్రజల్లో నిరవధికంగా ప్రబోధ కార్యక్రమం కొనసాగిస్తుంది; ఏ రూపంలో ఉన్నా సరే బూర్జువా జాతీయతను వ్యతిరేకిస్తుంది. ప్రస్తుత దశలో యుగోస్లోవియాలోని టిటోముఠా ఆధునిక రివిజనిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తోంది. వారు సామ్రాజ్యవాదానికి బంటుగా వ్యవహరిస్తున్నారు; సోషలిస్టు దేశాల ఐక్యతను, అన్ని దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ఇట్టి పరిస్థితుల్లో, మన దేశంలోని ప్రజల ప్రజాతంత్ర ఐక్య సంఘటన లోపల ప్రబోధ కార్యక్రమాన్ని అమలుజరపడం, ఆధునిక రివిజనిజాన్ని ప్రతిఘ టించడం, ఆధునిక రివిజనిజం యొక్క అభివృద్ధి నిరోధక ప్రాబల్యాన్ని నిర్మూలించడం చాలా ప్రాముఖ్యం కలిగి ఉన్నాయి.

"నేడు మన నినాదాలివి : చైనా ప్రజల ఐక్యత వర్ధిల్లాలి! అన్ని దేశాల ప్రజల ఐక్యత వర్ధిల్లాలి! ఈ రెండు విధాలైన ఐక్యతతో మన లక్ష్యం యాదేరి తీరుతుంది".

**(పెకింగ్ రివ్యూ సెప్టెంబర్ 1961 రిపావ్ చే : చైనాలో మార్క్సిజం, లెనినిజం విజయం**
**పెకింగ్ రివ్యూ: 1959 సంచిక:39, పుట :15)**

ooooo